సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 26 | సెప్టెంబర్ | 2023



కవులు, కళాకారులు రెండు కండ్లు - 8లో

సీఎం కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కండ్లని, రాష్ట్రంలో వారికి సముచిత స్థానం లభించిందని మంత్రి సత్యవతి అన్నారు.



పెంబర్తికి బెస్ట్ టూరిజం అవార్డు - 8లో

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జనగామ జిల్లాలోని పెంబర్తిని బెస్ట్ టూరిజం విలేజ్‌గా ఎంపిక చేసింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.5^0 / 23.7^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

నేడు మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ అధికారులతో ఫోన్ ఇన్

జిల్లాలోని మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల్లో ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు, మురుగునీరు నిల్వ, దోమల వృద్ధి, పందులు, కోతుల బెడద, డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య లోపంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్లు రాజు, మున్వర్ అలీ దృష్టికి తీసుకెళ్లేందుకు నేడు(మంగళవారం) 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.



మున్సిపల్ కమిషనర్ రాజు

మున్సిపాలిటీ : మరిపెడ,
మంగళవారం ఫోన్ చేయాల్సిన నంబరు :
9912395303
సమయం: ఉదయం12:00 నుంచి 1:00 గంటల వరకు



మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ

మున్సిపాలిటీ: డోర్నకల్
మంగళవారం ఫోన్ చేయాల్సిన నంబర్లు :
9390121800
9705346405
సమయం: ఉదయం10:00 నుంచి 11:00 గంటల వరకు

గర్భంలోనే తుంచేస్తుండ్రు

- విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు
- ఆర్‌ఎంపీల మధ్యవర్తిత్వం
- నామమాత్రంగా వైద్యాధికారుల తనిఖీ

సాక్షి, మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు విచ్చలవిడిగా చేస్తున్నారు. ఆడపిల్ల అని తెలియగానే తల్లిగర్భంలో తుంచేస్తున్నారు. వరుసగా ఆడపిల్లల పుట్టిన వారు కొందరైతే.. పెళ్లి కాకుండానే గర్భవతులైన వారు అబార్షన్లు చేయించుకుంటున్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు చేయించుకుంటున్నారని తెలిసింది. కమీషన్లకు కక్కుర్తిపడి పలువురు ఆర్‌ఎంపీలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు ప్రచారం. కాగా ఇంత జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఏదైనా ఘటన జరిగితే నామమాత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు

తల్లిగర్భంలో శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించే పలు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇదే అదునుగా భావించి గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మానుకోటలో అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లతో పాటు అనుమతి లేని సెంటర్లు కూడా వెలిశాయి. సెంటర్ల నిర్వాహకులు మధ్యవర్తుల ద్వారా రేటు మాట్లాడుకొని లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడ, మగ అనే విషయాలను కోడ్ భాష, సైగలతో చెబుతున్నారు. ఒక వేలు చూపిస్తే మగ, రెండు వేళ్లు చూపిస్తే ఆడ.. అదేవిధంగా శుక్రవారం అంటే ఆడపిల్ల, శనివారం అంటే మగ పిల్లవాడని తేల్చి చెబుతున్నట్లు ప్రచారం. ఇందుకోసం రూ.3వేల నుంచి రూ. 5వేల వరకు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తీసుకుంటున్నట్లు తెలిసింది.

తనిఖీలు అంతంతే..

జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా అబార్షన్లు, లింగనిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నా.. వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా సంఘటన జరిగితే నామమాత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో జిల్లా వైద్యాధికారులు పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేశారు. ఆ సమయంలో పలు సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని ఒక అభిప్రాయానికి వచ్చారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ, ఆయా సెంటర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రచారం జరిగింది. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లు, అబార్షన్లు చేసే ఆస్పత్రులను అధికారులు తనిఖీలు చేయకుండా చూడడం, తనిఖీల సమయంలో ముందుగానే సమాచారం ఇచ్చేందుకు ఆశాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మధ్యవర్తిగా ఉంటున్నారని ప్రచారం. ఇప్పటికైనా తనిఖీలు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



అబార్షన్లకు కేంద్రంగా..

మానుకోట అబార్షన్లకు అడ్డాగా మారిందని ప్రచారం. ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రి సమీపంలో ఉన్న పలు దవాఖానల్లో అబార్షన్లు చేస్తున్నట్లు తెలిసింది. సదరు ఆస్పత్రుల నిర్వాహకులు గర్భిణులకు ముందుగా పరీక్షలు నిర్వహిస్తారు. తర్వాత మధ్యవర్తులు, ఆర్‌ఎంపీల ద్వారా రేటు మాట్లాడి సదరు గర్భిణులను ఆస్పత్రులకు తీసుకురావాలని సూచిస్తారు. దీంతో వారు సమయానికి ఆస్పత్రులకు తీసుకెళ్లి అబార్షన్లు చేయించి ఇంటికి పంపిస్తారు. అబార్షన్ చేసినందుకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇందులో ఆర్‌ఎంపీలకు కమీషన్ ఇస్తున్నారు. కాగా అబార్షన్లు, లింగ నిర్ధారణ పరీక్షల కోసం జిల్లాతోపాటు భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన వారు కూడా వస్తున్నారని తెలిసింది.

నిఘా పెంచి చర్యలు తీసుకుంటాం



జిల్లాలో అబార్షన్లు అవుతున్నాయనే అనుమానాలు ఉన్నాయి. గతంలో తొర్రూరు, కురవిలో పలువురిపై కేసులు పెట్టాం. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రత్యేక నిఘా పెంచుతున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడ, మగ అని చెప్పడం నేరం. అలాంటి చర్యలకు ఎవరూ పాల్పడ్డా.. స్కానింగ్ సెంటర్ మూసివేస్తాం. ఆస్పత్రులు సీజ్ చేస్తాం.

-అంబరీష, జిల్లా వైద్యాధికారి

ఉద్యోగ, ఉపాధి కల్పనలో అగ్రస్థానం

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: ఉద్యోగ, ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందు వరుసలో ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామ శివారు రామ ఉపేందర్ గార్డెన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఈజీఎంఎం ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి మేళాను మంత్రి ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 82 కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాయి. 5,651మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 2,341 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. ఉద్యోగాలు పొందిన వారిని మంత్రి అభినందించి నియామక పత్రాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ..మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని తల్లిదండ్రులు చదివించారని, చదువుకు తగ్గ ఉద్యోగం లభించినప్పుడు గౌరవం, తృప్తి కలుగుతుందని అన్నారు. నిరుద్యోగ యువత వద్దకే వచ్చి ప్రముఖ సంస్థలు, కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎస్పీ చంద్రమోహన్, ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, ఈదురు రాజేశ్వరి, జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, శ్రీరాం జ్యోతిర్మయి, రంగు కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ, అడిషనల్ డీఆర్‌డీఓ సట్ల వెంకట్, ఆర్డీఓ నర్సింగరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

28న మరిపెడకు హరీశ్‌రావు రాక

మరిపెడ: ఈనెల 28న మరిపెడలో 100పడకల ఆస్పత్రి భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హాజరు కానున్నట్లు డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తెలిపారు. మరిపెడలో సోమవారం డోర్నకల్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరిపెడలో 100పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు వస్తున్న సందర్భంగా నియోజకవర్గం నుంచి కార్యకర్తలను వేలాదిగా తరలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, పలు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

న్యూస్‌రీల్

ఆ జీఓ రద్దు చేయాలి



మహబూబాబాద్: జీఓ నంబర్ 142ను రద్దు చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరికోట్ల రవి, నాయకుడు నాగబ్రహ్మచారి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీఓ 142ను రద్దుచేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రఫీ, కోశాధికారి రాజేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు వారికి మద్దతు తెలిపారు. మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణార్జునరావు, రామకృష్ణ, పురుషోత్తం, రవీందర్, వెంకన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి బాస నాగమణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు చేపట్టారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండుశాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. దీంతో అనేకమంది క్రీడాకారులు క్రీడాకోటలో పలు ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని, ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు భద్రయ్య, గౌస్ బాష, వీరన్న, రాణి, వర్మ, పద్మ, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



కొత్తగూడ: ఏజెన్సీ విద్యార్థుల కోసం కొత్తగూడ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రికి ములుగు ఎమ్మెల్యే సీతక్క హైదరాబాద్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. కొత్తగూడ, గంగారం మండలాల నుంచి డిగ్రీ విద్యార్థులు నర్సంపేట లాంటి పట్టణాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందన్నారు. వెళ్లలేని విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని వివరించారు. కొత్తగూడలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఆదివాసీ, గిరిజన, నిరుపేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సీతక్క తెలిపారు.

వేబ్రిడ్జి తూకంలో మోసం

- పత్తి రైతుల రాస్తారోకో

కేసముద్రం: వేబ్రిడ్జి తూకంలో మోసం జరిగిందంటూ ఆగ్రహించిన పత్తి రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగిన ఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు 2,975 పత్తి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ మేరకు వ్యాపారులు టెండర్లు వేసి వెళ్లారు. అనంతరం రైతులు మండల కేంద్రంలోని పలు వేబ్రిడ్జిలపై పత్తిలోడు వాహనాలు తూకం వేయించి సదరు వ్యాపారుల వద్దకు వెళ్లారు. అయితే తాను చెప్పిన వేబ్రిడ్జిపైనే తూకం వేయించుకురావాలనే ఓ వ్యాపారి ఆదేశాల మేరకు పలువురు రైతులు పద్మావతి వేబ్రిడ్జి వద్దకు వెళ్లి తూకం వేయించారు. కాగా మొదటి వేబ్రిడ్జి వద్ద వేసిన తూకానికి, పద్మావతి వేబ్రిడ్జిపై వేసిన తూకానికి 30 కిలోల తేడా వచ్చింది. దీంతో నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామానికి చెందిన దారావత్ సుధాకర్, పడాల శ్రీనివాస్ పత్తిలోడులో తూకం తక్కువ రావడంతో ఆగ్రహించి తోటి రైతులతో కలిసి పద్మావతి వేబ్రిడ్జి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. కాగా రాస్తారోకోతో రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఘటన స్థలానికి ఎస్సై తిరుపతి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చచెప్పి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కాగా గతంలోనూ మండలంలోని అన్నారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇదే విధంగా ధాన్యం బస్తాల తూకంలో తేడా వచ్చింది. ఇలా వ్యవసాయోత్పత్తులు అమ్ముకునే సమయంలో తూకాల్లో మోసం జరుగుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



ప్రధానరహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

విద్యార్థినులు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి

- డీఈఓ రామారావు

తొర్రూరు: విద్యార్థినులు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని డీఈఓ రామారావు అన్నారు. డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో వారం రోజులుగా జీవన నైపుణ్యాలపై కొనసాగుతున్న అవగాహన శిబిరం సోమవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. బాలికలకు కౌమార దశ ఎంతో ముఖ్యమని, ఈ దశలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జెండర్ అండ్ ఈక్విటీ సమన్వయకర్త విజయకుమారి, పాఠశాల ప్రత్యేకాధికారి బొజ్జ శైలజ, ఆర్పీలు శ్రీదేవి, దుర్గాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తొర్రూరులోని కేజీబీవీలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

మహబూబాబాద్ రూరల్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని, పంటతో లాభాలు గడించవచ్చని డీఏఓ ఛత్రునాయక్, జిల్లా ఉద్యాన అధికారి సూర్యనారాయణ అన్నారు. వ్యవసాయ కార్యక్రమాలపై జిల్లాలోని ఏఓలు, ఏఈఓలతో మహబూబాబాద్ రైతు వేదిక భవనంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు ఎక్కువ లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది వానాకాలంలో సాగవుతున్న వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలను క్లస్టర్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగు వివరాలు, పీఎం కిసాన్ పథకం, రైతు బంధు, రైతుబీమా పథకాలపై మండలాల వారీగా సమీక్షించారు. సమావేశంలో ఏడీఏలు లక్ష్మీనారాయణ, శోభన్ బాబు, టెక్నికల్ ఏడీఏ రాజనరేందర్, టెక్నికల్ ఏఓ సారయ్య, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థినుల అర్ధాకలి

- కస్తూర్బాలో మెనూ పాటించని నిర్వాహకులు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదిరోజులుగా మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. దీంతో విద్యార్థినులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కాగా మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ సరుకులు తీసుకురావడం లేదని తెలిసింది. అల్పాహారంలో అందించే స్నాక్స్, రాగిజావ, టిఫిన్ సామగ్రి తీసుకురావడం లేదు. అలాగే ప్రతీరోజు మధ్యాహ్నం, రాత్రి సోరకాయ, బీరకాయ, టమాట, చారుతో నిర్వాహకులు విద్యార్థినులకు వడ్డిస్తున్నారు. దీంతో సరైన భోజనం అందక విద్యార్థినులు ఇళ్లకు వెళ్తున్న విషయం తెలుసుకున్న జీసీడీఓ విజయకుమారి సోమవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. భోజనంలో మెనూ పాటించడం లేదంటూ విద్యార్థినులు జీసీడీఓకు వివరించారు. కాగా పెండింగ్‌బిల్లులు చెల్లిస్తామని, 15 రోజుల వరకు సరుకులు పంపించాలని సదరు కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు.



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న జీసీడీఓ

కేసీఆర్ పాలనలోనే విద్యాభివృద్ధి

- మంత్రి సత్యవతిరాథోడ్

గూడూరు: సీఎం కేసీఆర్ పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని చెండ్రుగూడెం సమీపంలో సోమవారం మంత్రి ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యను అందించడమే లక్ష్యంగా గురుకులాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గూడూరులో ఏకలవ్య పాఠశాల ఏర్పడడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టంగా చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కాగా ఏకలవ్య పాఠశాల నిర్మాణం జరుగుతున్న భూములను ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్నారని, వారికి మరోచోట భూమి ఇప్పించాలని గ్రామ సర్పంచ్ రమేష్‌నాయక్ కోరారు. కాగా వారికి సాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎంపీపీ బానోతు సుజాత, జెడ్పీటీసీ గుగులోతు సుచిత్ర, సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, జెడ్పీ కో ఆప్షన్ ఎండీ. ఖాసీం, ఆర్సీఓ రాజ్యలక్ష్మి, గురుకులాల అడిషనల్ సెక్రటరీ చంద్రశేఖర్, ఆర్డీఓ అలువేలు, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ రోజారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

ఎడ్యుకేషన్ హబ్‌గా మానుకోట

మహబూబాబాద్ రూరల్: మానుకోట ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని, సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తున్నారని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలోని జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్‌కి అనుబంధంగా హార్టికల్చర్ డిగ్రీ కళాశాల మంజూరైన నేపథ్యంలో అందుకు కావాల్సిన ఏర్పాట్లను ఆమె సోమవారం పరిశీలించారు. హార్టికల్చర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు సౌకర్యాల ఏర్పాట్లపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఉద్యాన డిగ్రీ కళాశాల ప్రారంభంతో ఈ ప్రాంత రైతులు, విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా స్థానిక విద్యార్థులకు 80శాతం అవకాశాలు కల్పిస్తూ జీఓ తీసుకొచ్చామన్నారు. భవిష్యత్‌లో మల్యాల రూపురేఖలు మారనున్నాయని, ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో హార్టికల్చర్ డిగ్రీ కళాశాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు విద్యను అందించాలనే సంకల్పంతో అనేక విద్యాలయాలను నెలకొల్పడం జరుగుతుందని, ఈ సువర్ణ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ శశాంక, ఎస్పీ చంద్రమోహన్, గ్రామ సర్పంచ్ కుమారి వెంకన్న, ఎంపీటీసీ బద్రిచంద్రు, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ బి.నీరజ ప్రభాకర్, రిజిస్ట్రార్ అండ్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ భగవాన్, కంప్ట్రోలర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ కిరణ్ కుమార్, మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త భాస్కర్, ఎస్టేట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జలగం విజయ్ సోమవారం తెలిపారు. సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు డిపో అభివృద్ధికి 99592 26054 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు.

కోతుల బారినుంచి పంటలను కాపాడండి



రాస్తారోకో చేస్తున్న రైతులు

కేసముద్రం: కోతుల బారినుంచి తమ పంటలను కాపాడాలంటూ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేసిన ఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయ బావుల వద్ద గతంలో కూరగాయలు పండించుకునే వాళ్లమని, కోతుల కారణంగా ఇప్పుడు కూరగాయలు పండించే పరిస్థితి లేదన్నారు. దీంతో కూరగాయలను కొనాలంటే నెలకు రూ.3వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫారెస్టు అధికారులు కోతులను పట్టి అడవిలో వదిలేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కాగా రాస్తారోకోతో పలు వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయాయి. కార్యక్రమంలో కంచ వెంకన్న, జోగు రవీందర్, కంకల కుమారస్వామి, తండ సంపత్, కంచ రాములు, అంకిరెడ్డి వీరన్న, సుధాకర్, సర్వర్, దేవయ్య, శ్రీనివాస్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పోస్టులు చేస్తే చర్యలు

- ఎస్పీ చంద్రమోహన్

మహబూబాబాద్ రూరల్: సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ చంద్రమోహన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల (వాట్సాప్ గ్రూప్‌లు, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్)ను సక్రమంగా వాడుకోవాలని సూచించారు. అలా కాకుండా వ్యక్తులను, వ్యవస్థలను టార్గెట్ చేసి ఎలాంటి పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎదుటి వారి ప్రతిష్ఠకు ఎవరు భంగం కలిగించొద్దని, అలాగే రెచ్చగొట్టే, కోపోద్రేకంగా ఉండే పోస్టులు ఎవరైనా పోస్టు చేస్తే శాంతిభద్రతలు భంగం కలుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, గ్రూప్ అడ్మిన్ తక్షణమే అలాంటి పోస్టులను తొలగించాలని, లేనిపక్షంలో పోస్ట్ చేసిన వారితోపాటు గ్రూప్ అడ్మిన్లపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఎస్పీ చంద్రమోహన్

డీజేలకు అనుమతి లేదు..

వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ జి.చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాండ్, ఇతర వాయిద్యాలతో ఊరేగింపు చేసుకోవాలన్నారు. ప్రజలు ఎలాంటి గొడవలు పడొద్దని కోరారు. నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

గార్ల: సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని డీఎల్‌పీఓ గంగాభవాని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ముల్కనూరు, గార్ల పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సైడ్ కాల్వల్లో పూడికతీత పనులు, పడావుబడ్డ బావులను మూసివేయకపోవడంతోనే దోమల ఉధృతితో గ్రామాల్లో విషజ్వరాలు, డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. సైడ్ కాల్వలు, ఇంటి పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ డబ్బాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పడావుబడ్డ బావులను వెంటనే పూడ్చివేయాలన్నారు. దుబ్బగూడెం గ్రామంలో ఇటీవల డెంగీతో 9నెలల చిన్నారి ప్రణీద మృతి చెందిందని, ఆమె మృతికి కారణమైన దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. ఎంపీఓ రజిని, సర్పంచ్ వట్టం జానకిరాణి, ఉపసర్పంచ్ ఎస్‌డీ సలీం, పంచాయతీ కార్యదర్శులు కుమారస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బావిలో క్లోరినేషన్ చేయిస్తున్న డీఎల్‌పీఓ గంగాభవాని

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


రాజేష్ మృతదేహం

నర్సంపేట రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలోని అంగడి సెంటర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా ఇంతెంచెరువుపల్లికి చెందిన అరకావత్ రాములు– జమున దంపతులకు ఏకైక కుమారుడు రాజేష్ (14) ఉన్నాడు. రాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజేష్ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని దామెరవంచ గిరిజన గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం క్రితం రాజేష్ తన స్వగ్రామానికి వెళ్లాడు. అయితే పాఠశాలకు రాజేష్ తిరిగి రాకపోవడంతో పాఠశాల నుంచి తండ్రికి ఫోన్ చేశారు. సోమవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై నర్సంపేటకు రాజేష్‌ను తీసుకొచ్చి దింపి, రూ. 500 ఇచ్చి గూడూరు బస్సు ఎక్కి వెళ్లాలని సూచించడంతో, వెళ్తానని రాజేష్ చెప్పాడు. దీంతో నమ్మిన తండ్రి స్వగ్రామానికి బైక్‌పై వెళ్లిపోయాడు. రాజేష్ పాఠశాలకు వెళ్లకుండా పట్టణంలోని ఓ పురుగుల మందు షాపుకు వెళ్లి పురుగుల మందుడబ్బాను కొని అంగడి సెంటర్‌లో తాగి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతి చెందడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని నర్సంపేట మార్చురికి తరలించారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. నర్సంపేట టౌన్ ఎస్సై శీలం రవిని వివరణ కోరగా మృతుడికి సంబంధించిన వారు ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..


కుమార్(ఫైల్)

తొర్రూరు రూరల్: చేపలు పట్టేందుకు వాగులో దిగిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని గుర్తూరుకు చెందిన పిల్లి కుమార్ (37) ఈ నెల 23న చేపలు పట్టేందుకు గ్రామశివారులోని ఆకేరు వాగుకు వెళ్లాడు. ఆ రోజు సాయంత్రం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. సోమవారం ఆకేరువాగులో కుమార్ శవమై తేలాడు. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి చనిపోయాడని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెంబర్తికి బెస్ట్ టూరిజం అవార్డు

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 27న అవార్డు ప్రదానం
- హస్తకళలకు దక్కిన మరో గౌరవం

జనగామ : హస్త కళలకు నిలయమైన పెంబర్తి ఒకప్పుడు కుగ్రామం. నేడు అద్భుత నగిషీలు తయారు చేసే కర్మాగారంగా విలసిల్లుతోంది. ఈ క్రమంలో ఈ గ్రామానికి అరుదైన అవార్డు లభించింది. విశ్వకర్మ కులానికి చెందిన సుమారు 200 మందికి పైగా కళాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందుతున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి రెండు ఉత్తమ గ్రామాలను ఎంపిక చేయగా.. అందులో జనగామ మండలం పెంబర్తి ఒకటి. బెస్ట్ టూరిజం విలేజ్‌గా ఎంపికైన ఈ గ్రామంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

1968లో విశ్వకర్మ సొసైటీ ఏర్పాటు

పెంబర్తిలో విశ్వకర్మ కళాకారులు మొదట్లో ఇత్తడి బిందెలు, కొప్పెర్లు తయారు చేసి కుటుంబాలను పోషించుకునే వారు. కాలానుగుణంగా పనికి పదును పెట్టి వివిధ రూపాల్లో నగిషీలను తీర్చిదిద్దడం ప్రారంభించారు. హస్తకళలకు ఒక రూపం ఇచ్చి గ్రామాన్ని కేంద్ర బిందువుగా నిలిపారు. నాటి నిజాం నవాబు పాలనలో వెండితో తయారు చేసిన కళాఖండాలను సామాన్యులు కొనలేని పరిస్థితుల్లో 'ఐలా' మదిలో మెదిలిన ఆలోచనే నేటి బ్రాస్ సొసైటీకి పునాది. తన గురువు మల్యాల వీరాచారి శిక్షణలో దివంగత ఐలా ఆచారి 1968లో గ్రామంలో 'విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్ ఇండస్ట్రీయల్ కోఆపరేటివ్ లిమిటెడ్ సొసైటీ'ని స్థాపించారు. మొదట ఐదుగురు కార్మికులతో ప్రారంభమైన శిక్షణ వందకు చేరి.. నేడు ఎన్నో వందల కుటుంబాలకు ఉపాధిగా నిలుస్తోంది. వంట పాత్రలతో పాటు అత్తర్‌దాన్, పాన్‌దార్, వగన్‌దాన్ ఇలా ఎన్నో కళాఖండాలు ఆయన చేతిలో రూపుదిద్దుకున్నాయి. సొసైటీ మొదటి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఐలాఆచారి కళాకారుల అభ్యున్నతికి పాటుపడుతూనే.. పెంబర్తి హస్తకళలను ప్రపంచానికి పరిచయం చేశారు.


కళాఖండాలు తయారు చేస్తున్న కళాకారులు

27న అవార్డుల ప్రదానం

ఈ నెల 27వ తేదీన న్యూఢిల్లీలోని భారత మండపంలో ఉదయం 10 గంటలకు జరిగే వేడుకల్లో జిల్లా తరుపున ఓ అధికారితో పాటు గ్రామానికి చెందిన ఓ ప్రముఖుడు అవార్డును అందుకోనున్నారు. దేశంలోని 31 రాష్ట్రాలు/యూటీల నుంచి బెస్ట్ టూరిజం విలేజ్ కాంపిటీషన్–2023 విభాగంలో 795 దరఖాస్తులు రాగా, తెలంగాణ నుంచి పెంబర్తితో పాటు మరో గ్రామం ఈ అవార్డుకు ఎంపికైంది. మూడు నెలల క్రితం భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ టూరిజం గ్రామాల ఎంపిక కోసం ఈ ఏడాది జూన్ 6వ తేదీన కేంద్ర బృందం పెంబర్తిలో పర్యటించింది.

నగిషీలకు డిమాండ్

పెంబర్తి కళాకారులు తయారు చేసిన నగిషీలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. చూడగానే మనసును కట్టిపడేసేలా కనిపించే నగిషీలకు ప్రతి ఒక్కరూ మంత్రముగ్ధులు కావాల్సిందే. రూ.2 వందల నుంచి మొదలు.. రూ.లక్షల విలువ చేసే కళాఖండాలు ఇక్కడ తయారు చేస్తారు.

సంతోషంగా ఉంది



జాతీయ స్థాయిలో బెస్ట్ టూరిజం విలేజ్‌గా పెంబర్తి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఇక్కడి కళాకారులు తయారు చేసే ఖండాలు అద్భుతం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పెంబర్తి కళాఖండాలకు డిమాండ్, పేరు ఉంది. ఈ నెల 27వ తేదీన న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమానికి జిల్లాకు చెందిన పర్యాటక శాఖ అధికారితో పాటు గ్రామం నుంచి ఒకరు హాజరవుతారు. ఇందుకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ మంగళవారం వరకు తెలుపుతాం.

– శివలింగయ్య, కలెక్టర్, జనగామ

ఎంపిక ఇలా

హస్తకళలకు పుట్టినిల్లు పెంబర్తి. జాతీయ రహదారి, రైల్వే మార్గం ఉన్న ఈ గ్రామంలో గ్రీనరీకి పెద్దపీట వేస్తున్నారు. అలాగే, హస్తకళ తయారీలో అంతర్జాతీయ గుర్తింపు, స్వచ్ఛత, ప్రజలకు మౌలిక వసతులు.. ఈ అంశాలు గ్రామానికి బెస్ట్ విలేజ్ అవార్డు రావడం ముఖ్యపాత్ర పోషించాయి.

అవార్డులకు పెట్టింది పేరు..

పెంబర్తి హస్త కళాకారుల ప్రతిభను గుర్తించిన కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవార్డులు ప్రకటించి సత్కరించాయి. 1990లో హస్తకళల విభాగంలో ఐలా ఆచారి అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. 1981లో జాజర్ల నాగరాజుచారి, ఐలా బట్టి మల్లయ్యకు జాతీయ అవార్డులు లభించాయి. తర్వాత రుద్రోజు రామ్మోహనాచారి, రంగు వెంకటేశ్వర్లు, రుద్రోజు శ్రీనివాసాచారిని అవార్డులు వరించాయి. 1985లో జాజర్ల శివరామచారి, 2022లో జాజర్ల భాస్కరాచారి అవార్డులు అందుకున్నారు. 1975 ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని నాటి సీఎం జలగం వెంగళరావు కళాకారులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 1986లో నాటి సీఎం ఎన్‌టీఆర్ చేతుల మీదుగా ఇక్కడి కళాకారులు అవార్డులు అందుకున్నారు. ఐలా ఆచారి చేతిలో తయారైన గావ్(కూజా) లాంటి కళాఖండాన్ని చూసిన నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, ప్రధాని ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు, ప్రముఖులు శంకర్‌దయాళ్ శర్మ, కుముద్‌బెన్‌జోషి, జ్ఞానీ జైల్‌సింగ్, మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు అనేక మంది నుంచి ప్రశంసలు అందుకున్న పెంబర్తి.. నేడు జాతీయ స్థాయిలో బెస్ట్ టూరిజం ప్రాంతంగా ఎంపిక కావడంతో గ్రామస్తులు, కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పుణ్యక్షేత్రాలు.. నంది అవార్డులు ఇక్కడివే..



దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో అలంకారప్రాయంగా కనిపించే ధ్వజస్తంభాలు, కిరీటాలు, మూల విరాట్‌లు, త్రిశూలం లాంటి ఎన్నో బ్రాస్ కళాఖండాలు ఇక్కడ తయారు చేసినవే. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ప్రధాన ద్వారాల అలంకరణ, ఆలయంలో బ్రాస్, ఇత్తడి, వెండితో తయారు చేసిన అనేక కళాఖండాలు పెంబర్తి కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్నవే. అమెరికాలోని మొగల్ దర్బార్ రెస్టారెంట్‌తో పాటు వెంకటేశ్వరస్వామి ఆలయాలకు ముఖద్వారాలు, హోర్డింగ్, ధ్వజస్తంభాలు, ఇత్తడి రేకులు తదితర కళాఖండాలు ఇక్కడ తయారై సప్తసముద్రాలు దాటి వెళ్లాయి.

రైలునుంచి దిగబోయి మహిళకు గాయాలు

- ఆస్పత్రికి తరలింపు

కాజీపేట : కదులుతున్న రైలునుంచి దిగబోయిన ఓ మహిళ. బోగి, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయింది. ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో ప్రాణాపాయం తప్పి తీవ్రగాయాలైన సంఘటన వరంగల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన సుంచు రాజమణి గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో పనిచేస్తుంది. ఈ క్రమంలో స్వగ్రామానికి వచ్చేందుకు ఆదివారం అహ్మదాబాద్–చెన్నై వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి నిద్రపోయింది. రైలు సోమవారం తెల్లవారుజామున 4.46 గంటలకు వరంగల్‌కు చేరుకుని కదులుతున్న సమయంలో ఆమె నిద్రలేచింది. తాను దిగాల్సిన స్టేషన్ దాటిపోయిందన్న హడావుడిలో కదులుతున్న రైలు నుంచి దిగబోయి కాలుజారి రైలు బోగి, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయింది. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే చైన్ లాగారు. రైలు ఆగిపోవడంతో రైల్వే పోలీసులు, ప్రయాణికులు ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుపోయిన మహిళను ప్లాట్‌ఫాం పగలకొట్టి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం ఆమెను 108 ద్వారా చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు.

బంగారం ఇవ్వలేదని కక్ష సాధింపు..

- నా భర్తను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు
- జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జ్ భార్య కన్నీరుమున్నీరు
- గ్రీవెన్స్‌లో జీసీసీ డీఎంను నిలదీత


పీఓకు తన గోడును వెల్లబోసుకుంటున్న భాగ్యలక్ష్మి

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లిలో రెండేళ్ల క్రితం నెలకొల్పిన జీసీసీ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జ్‌గా జీసీసీ సేల్స్‌మెన్ లచ్చబాబు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు రూ. 13 లక్షల వరకు అవకతవకలు జరగడంతో జీసీసీ అధికారులు గతేడాది లచ్చబాబును సస్పెండ్ చేశారు. అయితే పెట్రోల్ బంక్‌లో పనిచేసే వ్యక్తులు తనను మోసం చేశారని, రూ.13 లక్షల వరకు వారి ఖాతాల్లో ఉన్నాయని లచ్చబాబు ఆరు నెలల క్రితం జీసీసీ డీఎం ప్రతాపరెడ్డికి రాతపూర్వకంగా తెలిపారు. దీంతో జీసీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు వారు కూడా విచారణ చేపట్టారు. ఇందులో లచ్చబాబు కూడా అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. అయితే దీనిపై ఎలాంటి చర్యలు జరగలేదు. అనంతరం ఈ ఘటనపై విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ అధికారి కూడా విచారణ చేపట్టకుండా జాప్యం చేస్తూ లచ్చబాబును సస్పెన్షన్‌లోనే ఉంచారు. దీనికి విసిగి వేసారిన లచ్చబాబు భార్య భాగ్యలక్ష్మి తన కుమారుడితో కలిసి సోమవారం గ్రీవెన్స్‌కు హాజరై జీసీసీ డీఎం ప్రతాపరెడ్డిని నిలదీసింది. 'ప్రతి జనవరికి సేల్స్ మెన్లు మీకు బంగారు ఉంగరాలు ఇవ్వాలా... పది వేళ్లకు పది ఉంగరాలు పెట్టుకుంటారా' అవి ఇస్తేనే వారి జీతాలు, సమస్యలు తీర్చుతావా... అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లంచాలకు అలవాటు పడి జీసీసీ సేల్స్ మెన్లపై కక్షసాధింపు చర్యలుకు పాల్పడుతున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. తన భర్త తప్పు చేస్తే జైలుకు పంపాలన్నారు. లేదా అతని వద్ద నుంచి అవకతవకలకు గురైన డబ్బులు రికవరీ చేయాలన్నారు. అలా చేయకుండా బంగారం ఇవ్వలేదని కక్షతోనే తన భర్తను జీసీసీ డీఎం వేధిస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనను చూసిన ఐటీడీఏ పీఓ అంకిత్.. వారం రోజుల్లో లచ్చబాబు సమస్య పరిష్కరించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కాగా, ఈ ఘటనతో గిరిజన దర్బార్‌కు హాజరైన అధికారులు కంగుతిన్నారు. ఈ విషయంపై జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఎవరి వద్ద లంచం ఆశించలేదన్నారు. లచ్చబాబు జీసీసీకి ఇంకా రూ. 4.50 లక్షలు చెల్లించాల్సి ఉందని, అవి చెల్లిస్తేనే అతడిని ఉద్యోగంలోకి తీసుకుంటామన్నారు.

కేయూలో ఉద్యోగ సంఘాల సమ్మె వాయిదా

- రిజిస్ట్రార్‌తో బాధ్యుల చర్చలు
- నేడు పదోన్నతులు, కారుణ్యనియామకాలకు ఓకే


రిజిస్ట్రార్‌తో చర్చలు జరుపుతున్న ఉద్యోగ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ ఉద్యోగ సంఘాల బాధ్యులతో రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు సోమవారం రాత్రి చర్చలు జరిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తుండడంతో ఈనెల 26 నుంచి ఉద్యోగ సంఘాల ఆందోళన బాట పట్టాలని నిర్ణయించడంతో రిజిస్ట్రార్ ఉద్యోగ సంఘాల బాధ్యులను చర్చలకు ఆహ్వానించారు. చర్చల అనంతరం ఈనెల 26న పలు కేటగిరీల్లో ఉద్యోగులకు పదోన్నతులు, పలువురికి కారుణ్యనియామకాలకు ఉత్తర్వులు ఇచ్చేందుకు రిజిస్ట్రార్ అంగీకారం తెలిపారన్నారు. అలాగే మరో ఐదారు అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి నివేదిక ఆధారంగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను వాయిదా వేసేందుకు నిర్ణయించినట్లు కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు యాదగిరి, జనరల్ సెక్రటరీ తిరుపతి వెల్లడించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పెండ్లి అశోక్‌బాబు, హబీబుద్దీన్, కిష్టయ్య, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ షుకూర్, జనరల్ సెక్రటరీ కొర్నేలు పాల్గొన్నారు.

మహిళపై దాడి..


దాడికి పాల్పడిన కొండేటి రాజు

వర్ధన్నపేట: తనను ఆర్థికంగా దెబ్బతీసి దూరంగా ఉంచడంతోపాటు ఇంకొకరితో చనువుగా ఉంటుందనే కారణంతో ఓ వ్యక్తి.. మహిళపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వర్ధన్నపేట పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వర్ధన్నపేట వడ్డెర కాలనీకి చెందిన ఓ మహిళ..తన భర్త మృతి చెందడంతో పుట్టినిల్లు వర్ధన్నపేటలో ఉంటోంది. కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో ట్రాక్టర్ యజమాని కొండేటి రాజుతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో ఆర్థికంగా చితికిపోవడంతో రాజు ట్రాక్టర్‌ను అమ్ముకుని డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దీంతో సదరు మహిళ.. ఆర్థికంగా వెనకబడ్డాడని రాజును దూరం పెట్టింది. దీనికి ఆగ్రహం చెందిన రాజు.. మహిళను మందలించినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని పల్లె దవాఖాన వద్ద ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహం చెందిన రాజు కత్తితో మహిళపై దాడికి పాల్పడి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడిన మహిళను గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బాధితురాలి హుటాహుటిన 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. నిందితుడు రాజు పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా బాధితురాలిని ఆస్పత్రికి తరలించామన్నారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విధులు బహిష్కరించిన కాంట్రాక్ట్ లెక్చరర్లు

- కేయూ పరిపాలనా భవనం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లోని కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు విధులు బహిష్కరించి పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో కలిపి 1445 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారన్నారు. గత 143 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. మంత్రులను, ప్రజాప్రతినిధులను కూడా కలిసి విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ నాయకులు మధుకర్‌రావు, జరుపుల చందులాల్, చంద్రశేఖర్, జి.రమేష్, రఘువర్ధన్‌రెడ్డి, ఆర్‌డి ప్రసాద్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, వందన, శ్రీకల్పన, శ్రీలత, స్వప్న, మంజుల, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా యూనివర్సిటీలోని కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిలో 36 మంది విధులు బహిష్కరించారు. అలాగే వివిధ విభాగాల్లో కొందరు విధులు బహిష్కరించగా మరికొందరు యథావిధిగా విధుల్లో పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రిలే దీక్షలు

కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్(కుక్టా) జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లు రిలే నిరాహారదీక్షలు షురూ చేశారు. దీక్షలను కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ఆచార్యులు ఎం. సారంగపాణి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, కాంట్రాక్టు లెక్చరర్లు డాక్టర్ రవీందర్, మాదాసి కనకయ్య, సునీత, ప్రసాద్, రమాదేవి, డాక్టర్ కె.సాయిచరణ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వేధింపులు..

- భర్తను చితకబాదిన భార్య, అత్త..
- చికిత్స పొందుతూ మృతి
- కచ్చిర్లతండాలో ఘటన


భద్రునాయక్ (ఫైల్)

చిల్పూరు : మద్యం మత్తులో వేధింపులకు గురి చేస్తున్న భర్తను.. భార్య, అత్త చితకబాదారు. దీంతో తీవ్రగాయాలపాలైన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గార్లగడ్డ తండా పంచాయతీ పరిధిలోని కచ్చిర్ల తండాలో జరిగింది. ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బడి తండా పంచాయతీ పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన అంగోతు భద్రునాయక్ (40) ఆదివారం సాయంత్రం తన అత్తగారి ఊరు చిల్పూరు మండలం కచ్చిర్లతండాకు వచ్చాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో తన భార్య రమ, అత్త భూలీతో గొడవ పడ్డాడు. దీనిని గమనించిన చుట్టు పక్కల వారు గొడవను వారించి వెళ్లిపోయారు. అనంతరం అర్ధరాత్రి మరోసారి ఇద్దరిపై దాడికి యత్నించాడు. దీంతో భార్య, అత్త ఎదురుదాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన భద్రునాయక్.. అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు భద్రునాయక్ మద్యం మత్తులో గతేడాది సెప్టెంబర్ 12వ తేదీన ఇదే తండాలో తన మామ లావుడ్య బాలునాయక్‌తో గొడవ పడి రోకలితో బాదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో భద్రునాయక్ జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఆదివారం కూడా మరోసారి భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భార్య, ఆమె తల్లి ఎదురుదాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కామన్ మెస్ రీ ఓపెన్‌లో జాప్యం

- మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకున్న 39 మంది విద్యార్థులు
- నేటి నుంచి మెస్ సౌకర్యం: డైరెక్టర్ వెంకయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్ రీ ఓపెన్‌లో జాప్యం చేస్తున్నారు. పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తయిన విద్యార్థులు మూడో సెమిస్టర్‌లో ప్రవేశించారు. అయితే మెస్ బకాయిల్లో ఒక్కో విద్యార్థి కనీసం రూ.2,500 చెల్లించి హాస్టల్ వసతితో పాటు మెస్ కార్డును రెన్యూవల్ చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై.వెంకయ్య కోరారు. కొద్ది రోజులుగా రెన్యూవల్ ప్రక్రియ జరుగుతున్నప్పటికీ సోమవారం వరకు 39 మంది విద్యార్థులే మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకున్నారు. కనీసం 100 మంది అయినా రెన్యూవల్ చేసుకుంటే కామన్ మెస్‌ను తెరుస్తామని వెంకయ్య తెలిపారు. అయితే ఇప్పటికే మెస్‌కార్డులు పొందిన విద్యార్థులు కామన్ మెస్ ఓపెన్ చేయకపోయేసరికి ఇబ్బందులు పడుతున్నారు. తమకు మెస్ ఓపెన్ చేయాలని సోమవారం రెన్యూవల్ చేసుకున్న వారు హాస్టళ్ల డైరెక్టర్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు. ఈనెల 26 మధ్యాహ్నం నుంచి మెస్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా క్యాంపస్‌లో పద్మాక్షి మహిళా హాస్టల్ మెస్, ఇంజనీరింగ్ విద్యార్థుల మెస్ ఇప్పటికే రీ ఓపెన్ అయ్యాయి.

హాకథాన్ విజయవంతం


హాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో సోమవారం 12 గంటలు నిర్వహించిన హాకథాన్ విజయవంతమైంది. ఎస్సార్ కళాశాలతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్విరామంగా 12 గంటలు సాగింది. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరుచుకుని ముందుకు దూసుకుపోవడం హాకథాన్ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ కోడింగ్‌పై నైపుణ్యం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ శశికళ, డాక్టర్ శివకృష్ణారెడ్డి, డాక్టర్ అలీ, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కళ్లు

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- కాళోజీ పురస్కార గ్రహీత జయరాజ్‌కు ఆత్మీయ సన్మానం


జయరాజ్ దంపతులను సన్మానిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు

మహబూబాబాద్: సీఎం కేసీఆర్‌కు కవులు, కళాకారులు రెండు కళ్లని, తెలంగాణ ఏర్పాటు అనంతరమే కవులు , కళాకారులకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాకవి, గాయకుడు, కాళోజీ పురస్కార గ్రహీత గొడిశాల జయరాజ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అధ్యక్షత వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళోజీ పురస్కార గ్రహీత జయరాజ్‌ను సన్మానించడం సమాజాన్ని గౌరవించిన్నట్లేనన్నారు. సమాజ చైతన్యంలో జయరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం విశిష్ట అతిథి సీఎం ఓఎస్‌డీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంపై నిర్లక్ష్యమే తనను ఉద్యమం వైపు నడిపించిందన్నారు. పోరాటాలతో తెలంగాణ ఏర్పాటైందన్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి మాట్లాడుతూ మానుకోట బిడ్డ జయరాజ్‌కు అవార్డు రావడం హర్షణీయమన్నారు. స్వరాష్ట్రంలో కవులు, కళాకారులకు గుర్తింపు వచ్చిందన్నారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ జయరాజ్‌కు అవార్డు రావడంపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాళోజీ పురస్కార గ్రహీత , ప్రజాకవి, గాయకుడు జయరాజ్ మాట్లాడుతూ దాశరథిలా జీవిస్తానని, కాళోజీలా ప్రశ్నిస్తానన్నారు. కాళోజీ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటుతోనే తనకు అవార్డు వచ్చిందన్నారు. తన తల్లిదండ్రుల కష్టాలను గుర్తు చేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. అంతకుముందు తాండవ కృష్ణ నృత్య అకాడమీ విద్యార్థులు స్వాగత నృత్యం చేయగా, మరిపెడ, నెల్లికుదురు కేజీబీవీల విద్యార్థినులు, కురవి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు నృత్యం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కలెక్టర్ కె శశాంక, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ టి ప్రసన్న రాణి, బానోత్ రవికుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, డీఈఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.